క్లుప్తంగా

రగ్బీలో జిల్లాకు డబుల్ క్రౌన్



విజేతగా నిలిచిన కర్నూలు బాలబాలికల జట్లు

కర్నూలు (టౌన్): కావలి పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 1వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ రగ్బీ పోటీల్లో కర్నూలు జిల్లా బాలబాలికల జట్లు విజేతగా నిలిచి డబుల్ క్రౌన్ సాధించారు. విజేత కప్పు, మెడల్స్ అందుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 14 జిల్లాలు పోటీపడగా కర్నూలు జిల్లా జట్లు విజేతగా నిలవడంపై రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు సురేందర్, సుంకన్న, మహబూబ్ సుభాని ఉన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న కేవీ సుబ్బారెడ్డి, విక్రమ సింహారెడ్డి

కర్నూలు (టౌన్): పార్కుల్లో, కనిపించిన ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి, విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సంతోష్ నగర్‌లోని మసీదు పక్కన మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాలనీలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు చెట్లుగా పెరిగే వరకు కాలనీవాసులు పర్యవేక్షణ చేయాలన్నారు. సంతోష్‌నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి రంగయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్రైస్ట్ చర్చిలో క్యాండిల్ లైటింగ్



క్యాండిల్ లైటింగ్ కార్యక్రమంలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

కర్నూలు (టౌన్): స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న క్రైస్ట్ చర్చిలో సోమవారం సాయంత్రం క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు సిటీ ఎక్యూమినికల్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజమండ్రికి చెందిన దైవ సందేశకులు బ్రదర్ గిడియోన్ కట్టా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడు తూ యేసుక్రీస్తు ఈ లోకానికి వెలుగై ఉన్నాడ న్నారు. క్రైస్తవులు ఆధ్యాత్మిక జీవితంలో కొనసాగాలని, ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. చీఫ్ ప్యాట్రన్ రెవరెండ్ బోనాల శశికుమార్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. అనంతరం దైవ సేవకులకు నూతన వస్త్రాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి విల్సన్ బాబు, కోశాధికారి చిట్టిబాబు పాల్గొన్నారు.


పూడికతీత ముమ్మరం చేయండి



కృష్ణానగర్‌లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని మురుగు కాల్వల్లో పూడికతీత పనులు ముమ్మరం చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. సోమవారం స్థానిక కృష్ణానగర్, బిర్లాకాంపౌండ్, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీల్లో మురుగు నీరు ప్రవాహానికి ఆటంకం కలగకుండా పూడికతీత పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. పలు కాలనీల్లో కల్వర్టులు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. డీఈఈ మనోహర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఈ మనోహర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం



గోమాతకు సీమంతం నిర్వహించి హారతి ఇస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి దేవాలయం ఆవరణలోని శ్రీ సూర్యదత్త గోరక్షణ శాలలోని దేవి అనే గోమాతకు సోమవారం పూజలు చేసి సీమంతం నిర్వహించారు. గోవును సుందరంగా అలంకరించి షోడశోపచారాలను అర్పించి వివిధ రకాల ఫలాలు, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. మంగళహారతులు ఇచ్చి గోమాతకు అనుగ్రహానికి పాత్రులయ్యారు. అనంతరం తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో నరకం

- అరకొరగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- పనుల్లో నాణ్యత కొరవడటంతో పదేపదే సమస్య
- వాహనదారుల అసహనం



రోడ్డు మధ్యలో పైప్‌లైన్ మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులు



పైప్‌లైన్ మరమ్మతులు చేసేందుకు రోడ్డును తవ్వేసిన వాటర్‌వర్క్స్ సిబ్బంది

కర్నూలు న్యూసిటీ: నగరం నడిబొడ్డున నిత్యం రద్దీగా ఉండే రహదారి.. వేల సంఖ్యలో వాహనాలు తిరిగే కూడలి. ఆర్టీసీ బస్టాండ్‌కు కూత వేటు దూరంలో ఉండే ఈద్గా కూడలిలో పైపులైన్ లీకేజీ నగరవాసులకు నరకం చూపిస్తోంది. పైపులైన్ లీకేజీ అయినప్పుడు అధికారులు పొక్లెయిన్‌తో రోడ్డును తవ్వేసి తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తూతూమంత్రంగా పనులు

అధికారులు తూతూమంత్రంగా పనులు చేపట్టడం దీంతో కొద్ది రోజులకే మళ్లీ సమస్య మొదటికి రావడం షరామాములుగా మారింది. పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి రోడ్డు దెబ్బతిన్నప్పుడు రవాణా శాఖ అధికారులు బాగు చేసేందుకు కనీసం నెలన్నర అవుతుంది. అప్పటివరకు నగరవాసులు ఆ గుంతల్లోనే ఆపసోపాలు పడుతూ ప్రయాణిస్తుంటారు. రవాణా శాఖ అధికారులు గతుకుల బొంతలా రోడ్డును వేస్తారు. అంతటితో సమస్య తీరిపోదు. రోడ్డు వేసిన వారం పదిరోజులకు పైప్‌లైన్ మళ్లీ పగిలిపోయి నీరు పైకి ఉబికివస్తూ తారురోడ్డు శిథిలమై వాహన దారులకు నరకం చూపుతుంది. నీటిసరఫరా అధికారులు రోడ్డును తవ్వేసి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయడం, రవాణా శాఖ అధికారులు వారికి వీలు దొరికినప్పుడు రోడ్డును బాగుచేయడం, తిరిగి పైప్‌లైన్ పగిలిపోయి నీరు లీకై రోడ్డు పాడై పోవడం నిత్యకృత్యంగా మారి నగరవాసులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.

ముందస్తు, ప్రత్యామ్నాయ చర్యలు ఉండవు

పంపుహౌస్ నుంచి బుధవారపేట ఇతర ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేసే భూగర్భ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో గత వారం రోజులుగా ఈద్గా ముందున్న రహదారిపైకి నీరు ఉబికి వస్తూ వాహనాల రాకపోకల వల్ల తారురోడ్డు ఛిద్రం అయిపోయింది. దీంతో వాటర్‌వర్క్ కార్మికులు ఎలాంటి ముందస్తు, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా నడిరోడ్డును పొక్లెయినర్‌తో తవ్వేశారు. దీంతో అటువైపు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తవ్వేసిన గుంత పక్కన ఇరుకు రోడ్డులో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. ఈ రహదారి ఎప్పుడు ఇలానే ఉంటుందా అని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

పైప్‌లైన్ లీకేజీ పనులు చేసేటప్పుడు ఎలాంటి ముందస్తు, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోడంతో ఆ ప్రాంతమంతా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది.



పైప్‌లైన్ లీకేజీతో చిత్తడిగా మారిన రోడ్డు

ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు కనిపించకపోవడంతో ప్రజలే జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. నిత్యం ట్రాఫిక్‌లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. అలాగే లీకేజీ నీటితో రహదారి చిత్తడిగా మారడంతో రాకపోకలకు అసౌకర్యంగా మారింది.

మైనారిటీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ



సయ్యద్ సబీహా పర్వీన్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మైనారిటీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ముస్లింలు, క్రైస్తవులు (బీసీ - సీ), సిక్కు, బౌద్ధులు, జైన్, పార్శీ తదితర సామాజిక వర్గాలకు చెందిన వారు ఉచిత కోచింగ్‌కు అర్హులన్నారు. ఈ కోచింగ్ అందించేందుకు అర్హత కలిగిన సంస్థలు, అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రముఖ ప్రైవేటు సంస్థలతో ఎంప్యానెల్ చేయడం ద్వారా ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు జిల్లాలోని ఆసక్తి కలిగిన సంస్థలు, అభ్యర్థులు వెబ్‌సైట్ www.apcedmmwd.org పోర్టల్ ద్వారా లేదా డైరెక్టర్ కార్యాలయం, మైనారిటీల విద్య అభివృద్ధి కేంద్రం, స్వాతి థియేటర్ ఎదురుగా, భవానీపురం, విజయవాడ 520012 చిరునామాకు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0866- 2970567 నంబర్ లేదా ఈ - మెయిల్ ఐడీ cedma p2017@gmail.comలో సంప్రదించాలన్నారు.

రహదారి ఆక్రమణపై చర్యలు తీసుకోండి



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): దేవనగర్‌లో రహదారిని ఆక్రమించుకొని షెడ్డు ఏర్పాటు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కాలనీ వాసి హరికృష్ణ ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన 16 ఫిర్యాదులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ ఆర్.జి.వి.క్రిష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓలు జునీద్, ఇశ్రాయేలు, ఎంఈలు సత్యనారాయణ, టీపీఆర్ ఓ.వెంకటలక్ష్మీ, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- రేడియో స్టేషన్ సమీపంలోని శాంతినగర్ కాలనీలో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి విన్నవించారు.
- బుధవారపేట హంద్రీ నది వద్ద జ్యోతిర్లింగ శివాలయం పక్క వీధిలోకి వెళ్లే రహదారి కల్వర్టు ధ్వంసం అయ్యిందని, పునర్నిర్మించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు కృష్ణ, అశోక్ విన్నవించారు.
- అనర్హత రావడంతో టిడ్కో గృహానికి చెల్లించిన డీడీ నగదును వెనక్కి ఇప్పించాలని నర్మద, షేక్షావలి వినతిపత్రం ఇచ్చారు.
- ఎన్టీఆర్ భరోసా పథకం కింద తమకు వృద్ధాప్య వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని షేక్ మన్సూర్ బాషా, చాంద్‌బాషా, సద్దాం బాష, రహీం తదితరులు అర్జీలు అందజేశారు.

పేద ఆర్యవైశ్యులకు ఆవోపా చేయూత

కర్నూలు(అర్బన్): పేద ఆర్యవైశ్యుల జీవనోపాధుల మెరుగునకు ఆవోపా ఆధ్వర్యంలో చిరస్మరణీయ సేవా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆవోపా కన్వీనర్ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ఈ పథకం ద్వారా ఒక నిర్ణీత మొత్తాన్ని దాతల నుంచి సేకరించి బ్యాంకులో డిపాజిట్ చేసి ఏటా వచ్చే వడ్డీతో దాత మృతి చెందిన రోజున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గతేడాది ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 13 సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక అశోక్‌నగర్‌లో బజ్జీల బండి నిర్వహించే సన్నిధి వెంకటేశ్వర్లు జీవనోపాధికి రూ.11,500 విలువ చేసే గ్రైండర్‌ను దాత



గ్రైండర్‌ను అందిస్తున్న దాతలు

స్వర్గీయ నుగ్గు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు అందించారన్నారు. అలాగే కృష్ణగిరి మండలం పోతుగల్లుకు చెందిన ఇల్లూరు రామాంజనేయులుకు టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకునేందుకు మూలధనం, వసతులను కల్పించడం జరిగిందన్నారు.

ఖజానా శాఖకు వివరాలు పంపండి



కమిషనర్ రవీంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మునెప్ప

కర్నూలు (టౌన్): మున్సిపల్ కార్మికుల సమాచారాన్ని ఖజానా శాఖ కార్యాలయానికి పంపించాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలకలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ ప్రజా ఆరోగ్య శాఖ విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికుల సమాచారాన్ని ఖజానా శాఖ కార్యాలయానికి పంపించాలన్నారు. పీడీ అకౌంట్లు కోసం సదరు సమాచారాన్ని చేరవేయాలన్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేక మున్సిపల్ కార్మికులు రూ.వేలల్లో డీఏ బకాయిలు నష్టపోయారన్నారు. ఇప్పటికైన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐటీయుసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏపి మున్సిపల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి మద్దిలేటి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ విస్తృత తనిఖీలు

కర్నూలు(హాస్పిటల్): చలిగాలులతో ఆసుపత్రిలో రాత్రివేళ ఇబ్బంది పడే రోగుల సహాయకులకు ఎదురుగా ఉన్న శాలమ్మ సత్రంలో విశ్రాంతి తీసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం రాత్రి ఆయన ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ విభాగంలో డీఏపీ, డీఏఎస్ డ్యూటీ అసిస్టెంట్ల గురించి ఆరా తీశారు. రౌండ్స్ నిర్వహించే సమయంలో డీఏఎస్ (అసిస్టెంట్ సర్జన్) లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు డాక్టర్‌ను వెంటనే పిలిపించి అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చెప్పారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో పేషంట్, అటెండర్స్ నిద్రిస్తున్న విషయాన్ని ఆరా తీశారు. రోగుల సహాయకులు ఎక్కడపడితే అక్కడ నిద్రించకుండా శాలమ్మ సత్రంలో నిద్రించే విధంగా చూసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశించారు.



రోగి ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్న సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు

'షణ్ముఖి' పురస్కార ప్రదానం

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల సీనియర్ కళాకారుడు గుర్రపుశాల అంకయ్య 'షణ్ముఖి' పురస్కారాన్ని అందుకున్నారు. తణుకు సురాజ్య భవనంలో కళాపీఠం ఆధ్వర్యంలో షణ్ముఖి ఆంజనేయ రాజు 96వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ మేరకు నట ప్రవీణ గుర్రపుశాల అంకయ్యకు తణుకు శాసనసభ్యులు అరిమిల్లి రాధాకృష్ణ, షణ్ముఖి ఆంజనేయ రాజు కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు రసరాజు, విజయ షణ్ముఖి అవార్డును ప్రదానం చేశారు. అనంతరం శ్రీకృష్ణ తులాభారం నాటకంలోని అలకపాన్పు ఘట్టంలో అంకయ్య శ్రీకృష్ణుడి పాత్రను పోషించి అలరించారు. పురస్కారం అందుకున్న అంకయ్యను పలువురు కళాకారులు అభినందించారు.



గుర్రపుశాల అంకయ్యకు పురస్కార ప్రదానం చేస్తున్న అతిథులు

కూటమి పాలనలో పేదలకు వాత

- ప్రజలపై విద్యుత్ ట్రూఅప్ చార్జీల భారం
- గ్యాస్ సబ్సిడీ హోర్డింగ్‌లే తప్పా రాయితీ జమ చేయడం లేదు
- డీఎస్సీ సంతకంతో కోచింగ్ సెంటర్లకు పండుగ
- సీపీఎం మహాసభల్లో కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): కూటమి పాలనలో వంట నూనెల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మద్దతుతో నడుస్తున్నా రాష్ట్రానికి న్యాయం జరగడం లేదన్నారు. కనీసం 10 వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమను కర్నూలులో ఏర్పాటు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు రోజులుగా జరుగుతున్న కర్నూలు న్యూసిటీ నగర కమిటీ మూడో మహాసభలు సోమవారం ముగిశాయి. సాయంత్రం నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంట్‌లో ఆదానీపై చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ.. కూటమి సర్కార్‌లో పేదలకు వాతలే వాతలు పెడుతున్నారని విమర్శించారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీల భారం వేశారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు అయ్యే ఖర్చు కంటే ప్రచార హోర్డింగ్‌లకే ప్రభుత్వం ఎక్కువగా ఖర్చు చేస్తోందన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ అయ్యి 10 రోజులు గడిచినా సబ్సిడీ జమ కావడం లేదన్నారు. డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంతో కోచింగ్ సెంటర్లకు పెద్ద పండగ వచ్చిందన్నారు. అభ్యర్థులు చిన్న చిన్న ఉద్యోగాలు మానుకుని, అప్పులు చేసి కోచింగ్‌కు చేరడంతో వారి ఖజానా డబ్బులతో గలగలలాడుతోందన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరకుతుండడంతో విద్యార్థులు వాటి బారిన పడిజీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, వర్గ సభ్యులు పి.నిర్మల, పీఎస్ రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు అరుణ, అలివేలు, నగేష్, సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సీపీఎం న్యూసిటీ నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా టి.రాముడు, నగర కార్యవర్గ సభ్యులుగా ఆర్.నరసింహులు, సీహెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్, కె.అరుణ, మరికొందరు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు (సెంట్రల్): శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా బి.కె.వెంకటేశ్వర్లు సోమవారం సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సెలవులో ఉన్న ఆయన్ను ఎస్ఎస్‌పీ స్పెషల్ కలెక్టర్‌గా నియమించింది. ఈ క్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ప్రతిభ చాటిన గురుకుల విద్యార్థులు

కల్లూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటారు. గురుకులాల అంతర్ పాఠశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను పశ్చిమగోదావరి జిల్లా పెదవేగిలో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నటేకూరు గురుకుల కళాశాల విద్యార్థులు ఖోఖో క్రీడలో విజయం సాధించారు. అలాగే లాంగ్‌జంప్‌లో రెండవ స్థానం సాధించారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ మహానంది, ఐఐటీ, మెడికల్ అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు, పీడీ చంద్రశేఖర్, పీఈటీ కిరణ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

- చిన్నటేకూరు గురుకుల కళాశాల విద్యార్థుల కోసం ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ సోమవారం వాలీబాల్స్, బాస్కెట్ బాల్స్ ఉచితంగా అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు.

నర్సింగ్ కళాశాలల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని నర్సింగ్ కళాశాలల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్-నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయుడు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాలలు ఫీజుల దందాకు పాల్పడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. కౌన్సెలింగ్ జరగకుండానే అడ్మిషన్ల పేరుతో అక్రమంగా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించిన వారిపై ప్రాక్టికల్స్, ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ మార్కుల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆయా కళాశాలల అక్రమాలపై విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె.జగన్నాథం, ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో కర్నూలు నగర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీపీఐ ఆవిర్భవించి 100వ సంవత్సరంలోకి అడుగు పెట్టనున్న నేపథ్యంలో ఏడాది పాటు శత వార్షికోత్సవాలను నిర్వహించేందుకు పార్టీ నిర్ణయించినట్లు చెప్పారు. అందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. నాయకులు చంద్రశేఖర్, డి.శ్రీనివాసరావు, నాగరాజు, అన్వర్, కుమార్, సోమన్న, గిడ్డమ్మ పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి అభిషేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమావాస్యకు వచ్చిన భక్తులు సోమవారం కూడా స్వామి దర్శనానికి వేచి ఉండడంతో స్వామి క్షేత్రంలో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

సూపర్ సిక్స్ అమలు చేయలేక అసత్య ఆరోపణలు

- తప్పుడు కేసులతో వేధిస్తే కూటమి పునాదులు పెకిలిస్తాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్



వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): తప్పుడు కేసులతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఇబ్బంది పెట్టాలని చూస్తే ప్రజా ఉద్యమంతో కూటమి పునాదులు పెకిలిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక సి.క్యాంపులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం చేతకాక ప్రజలను డైవర్ట్ చేసేందుకు జగనన్నపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సంపద సృష్టిస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు రాజకీయ కక్షలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలపై ప్రజల దృష్టి మరల్చేందుకు జగనన్నపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్న విషయం ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, త్వరలోనే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కూటమి పార్టీలు హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టపరంగా కేసులు పెట్టవచ్చని, అక్రమ కేసులతో వేధిస్తే ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి గుణపాఠం చెబుతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలు, ఉన్నత వర్గాల్లోని పేదలందరూ జగనన్న పాలనను గుర్తుకు చేసుకుంటున్నారని చెప్పారు.

ఇద్దరికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని అశ్విని హాస్పిటల్‌లో ఇద్దరు రోగులకు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు హాస్పిటల్ గ్యాస్ట్రో అండ్ లివర్ యూనిట్ విభాగం వైద్యులు డాక్టర్ సుజిత్ రెడ్డి, డాక్టర్ దీపక్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రాకేష్ చెప్పారు. సోమవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆహారం, నీరు మింగడానికి ఇబ్బంది పడుతున్న కర్నూలుకు చెందిన యోగేశ్వరరెడ్డి (63), శివరాణి (59) అనే ఇద్దరికి ఈసోఫేజియల్ మానోమెట్రీ అనే ప్రత్యేక పరికరం ద్వారా పరీక్షలు చేసి అకలేషియా కార్డియం ఉన్నట్లు నిర్ధారించామన్నారు. ఇలాంటి వ్యాధికి ఓపెన్ లేదా లాప్రోస్కోపీ పద్ధతి ద్వారా శస్త్రచికిత్స చేస్తారని, అయితే ఈ ఇద్దరికీ కోత లేకుండా త్రీస్పేస్ ఎండోస్కోపీ పద్ధతిలో శస్త్రచికిత్సను విజయవంతం నిర్వహించామన్నారు. రెండు రోజుల్లోనే బాధితులు కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఇప్పుడు వారు ఆహారం తినడానికి, మింగడానికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.



ఆధునిక ఎండోస్కోపీ ద్వారా చికిత్స చేస్తున్న వైద్యులు

నేడు యువజన కాంగ్రెస్ సమావేశం

కర్నూలు(సెంట్రల్): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు యువజన కాంగ్రెస్ సమావేశం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, ఆలిండియా యూత్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మమతా నాగిరెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ముఖ్య నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, యువజన నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు.